www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 29 మే 2023
5
తిరుపతి

ముత్యపుపందిరి వాహనంపై గోవిందుడి కటాక్షం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: స్థానిక శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన ఆదివారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజస్వామివారు ముత్యపుపందిరి వాహనంపై భక్తులను కటాక్షించారు. రాత్రి 7 గంటలకు స్వామివారి వాహన సేవ ప్రారంభమైంది. నిత్య అలంకార ప్రియుడైన శ్రీవారు పూటకొక అలంకారంలో దేదీప్యమానంగా వెలిగిపోతుంటారు. మనస్సుకు ఆహ్లాదాన్ని కలిగించే ముత్యపుపందిరిపై భక్తులను చల్లగా ఆశీర్వదిస్తారు. చల్లని ముత్యాల కింద నిలిచిన స్వామివారి దర్శనం తాపత్రయాలను పోగొట్టి, భక్తుల జీవితాలకు చల్లదనాన్ని సమకూరుస్తుందనడంలో సందేహం లేదు. శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, కంకణ బట్టార్ ఏపి శ్రీనివాస దీక్షితులు, ఆలయ డెప్యూటీ ఈవో శాంతి, ఏఈవో రవికుమార్, సూపరింటెండెంట్ నారాయణ, టెంపుల్ ఇన్స్పెక్టర్ రాధాకృష్ణ, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నేడు జిఎస్ఎల్వి-ఎఫ్ 12 రాకెట్ ప్రయోగం

ఆదివారం ఉదయం 7.12 గంటలకు కౌంట్ డౌన్ ప్రారంభం

ప్రజాశక్తి- సూళ్లూరుపేట

భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మరో రాకెట్ ప్రయోగానికి రంగం సిద్ధం చేసింది. తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి నేటి ఉదయం 10 గంటల 42 నిమిషాలకు జిఎస్ఎల్వి -ఎఫ్12 రాకెట్‌ను ప్రయోగించడానికి అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసింది. ఈ ప్రయోగానికి ఉదయం 7.12 గంటలకు కౌంట్‌డౌన్ ప్రక్రియ ప్రారంభమైంది. 7.30 గంటల వరకు కౌంట్‌డౌన్ ప్రక్రియ కొనసాగిన అనంతరం జిఎస్ఎల్వి- ఎఫ్12 రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది. ఈ రాకెట్ ద్వారా ఎన్‌విఎస్ -01 అనే నేవిగేషన్ ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నారు. శ్రీహరికోటలోని రెండవ ప్రయోగ వేదిక నుంచి ఈ ప్రయోగం జరిగింది. 2232 కిలోల బరువు ఉండే ఎన్‌విఎస్ -01 అనే నేవిగేషన్ ఉపగ్రహాన్ని భూదవ కక్షలో ప్రవేశ పెట్టనున్నారు. ఈఉపగ్రహం ద్వారా బహుళ ప్రయోజనాలు సమకూరనున్నాయి. ప్రస్తుతం మొబైల్‌ఫోన్‌లలో వాడుతున్న జిపిఎస్ తరహాలో నేవిగేషన్ ఉపగ్రహం సేవలు అందిస్తుంది. దీంతో పాటుగా భూగోళ, సముద్ర మార్గాలలో దారి చూపడానికి వైమానిక ప్రయోజనాల కోసం ఉపయోగపడుతుంది. వ్యవసాయ రంగానికి, విమానాల సర్వీసులకు, అత్యవసర ప్రయోజనాలకు, సముద్రంలో మత్య సంపదను గుర్తించడానికి, వివిధ ప్రభుత్వశాఖల ప్రయోజనాల కోసం ఈఉపగ్రహం ప్రధానంగా ఉపయోగపడుతుంది. 51.7మీటర్లు ఎత్తు, 420 టన్నులు బరువు కలిగిన జిఎస్ఎల్వి -ఎఫ్12 రాకెట్ మొత్తం మూడు స్టేజిలు ఉంటుంది. రాకెట్ ప్రయోగం జరిగిన అనంతరం 18నిమిషాల నుండి 19 నిమిషాల మధ్య సమయంలో ఎన్‌విఎస్-01 ఉపగ్రహాన్ని నిర్దిష్ట కక్షకు చేర్చడం జరుగుతుంది. ఈఉపగ్రహం 12సంవత్సరాల పాటు సేవలు అందించే విధంగా ఇస్రో శాస్త్రవేత్తలు రూపొందించారు. గతంలో ప్రయోగించి ఉన్న నేవిగేషన్ ఉపగ్రహాలకన్నా అత్యంత అధునాతన సాంకేతిక పరికరాలను ఈ ఉపగ్రహంలో పొందుపరచడం జరిగింది.

గాలివాన బీభత్సం

- ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం
- కొట్టుకుపోయిన ఇళ్ల పైకప్పులు, పడిపోయిన చెట్లు
- తెగిన విద్యుత్ వైర్లు, ఆగిన సరఫరా

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి నగరంలో ఆదివారం మధ్యాహ్నం 3.30 నుంచి 4.30 గంటలకు వరకు గంటపాటు ఉరుములు, మెరుపులతో కూడి గాలివాన బీభత్సం సృష్టించింది. 4.8ఎంఎంగా వర్షపాతం నమోదు అయ్యింది. నగరంలోని 40కిపైగా ఇంటి పైకప్పు (రేకులు) గాలికి కొట్టుకుపోయాయి. అంతేకాకుండా హోర్డింగ్స్, ప్రకటన బోర్డులు గాలికి జనంపై పడ్డాయి. భారీ చెట్లు నేలకూలడంతో పలుచోట్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. విద్యుత్తు తీగలపై చెట్లు పడటంతో విద్యుత్ సరఫరా ఆగిపోయి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. డిఆర్ మహల్ వద్ద ఓ కారుపై చెట్లు పడటంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి వాహనదారులు అవస్థలు పడ్డారు. కొరమేను గుంట ప్రాంతంలో గాలికి గోడకూలి ఆటోపై పడటంతో ఆటో ధ్వంసమైంది. ఇందిర ప్రియదర్శిన కూరగాయల మార్కెట్ వద్ద వ్యాపారస్తుల గొడుగులు, దుకాణం ముందు ఏర్పాటు చేసుకున్న టెంట్లు గాలికి ఎగిరిపోయాయి. ఇదే పరిస్థితి రాయల్‌చెరువు రోడ్డులోని రైతుబజార్‌లో కూడా నెలకొంది. రేణిగుంట తిరుపతి మార్గంలోని ఆటోనగర్ వద్ద చెట్లు ఎక్కువగా విరిగి రోడ్డుపై పడటంతో వాహనదారులు ఇబ్బందిపడ్డారు. అలాగే పలువురికి చెందిన ఇళ్లు, షాపుల పైకప్పులు, రేకులు కొట్టుకుపోయాయి. ఎస్వీ యూనివర్సిటీ సమీపంలో పలుచెట్లు నేలకొరిగాయి. గాలివాన వల్ల నగరంలో విద్యుత్ సరఫరా పూర్తి అంతరాయం ఏర్పడింది. టెలిఫోన్ కేబుల్ వైర్లు కూడా తెగిపోయాయి. ఉరుములు, పిడుగుల శబ్దాలకు ప్రజలు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది.

ఇంటిపై కప్పు గాలికి కొట్టుకుపోవడంతో ఇబ్బంది పడుతున్న గృహిణి

ఆటోనగర్ వద్ద రోడ్డపై చేరిన వర్షపు నీరు, ఇబ్బంది పడుతున్న వాహనదారులు

మహిళలు పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్:

ప్రతి మహిళా వ్యక్తిగత పరిశుభ్రత, రుతుస్రావంపై అవగాహన కలిగి ఉండాలని మెప్మా సంచాలకులు రాధమ్మ తెలిపారు. ఆదివారం జీవకోన సిఆర్‌సి బిల్డింగ్‌లో అంతర్జాతీయ రుతుస్రావ అవగాహన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుటుంబంలో మహిళల ఆరోగ్యం ప్రధామని, రుతుస్రావంపై అవగాహన కలిగి ఉండాలని, పరిశుభ్రతను పాటించాలని తెలిపారు. అలాగే కుటుంబంలోని మగవారు కూడా మహిళకు సహకారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం వెంకటలక్ష్మీ, సిఎంఎం కృష్ణవేణి, టిఇ.సోమకుమార్, మహేష్, ఈసీ సభ్యులు, ఆర్పీలు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలిక అప్పగింత

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: తిరుమల శ్రీవారి దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో తప్పిపోయిన బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించిన సంఘటన ఆదివారం తిరుపతిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతి జిల్లా వెంకటగిరి మండలం చిన్నపరెడ్డిగారి పల్లెకు చెందిన వి.మస్తాన్ కుటుంబ సభ్యులు తిరుమల దర్శనం చేసుకుని అలిపిరి డిపో బస్సులో తిరుమల నుంచి ఆదివారం బయలుదేరారు. ఉదయం 12 గంటలకు తిరుపతి బస్టాండ్ వద్ద మస్తాన్ కుటుంబం దిగారు. కానీ చిన్నారి హేమశ్రీ బస్సు సీట్లోనే నిద్రపోయింది. దీన్ని కుటుంబ సభ్యులు గమనించకపోవడంతో బస్సు రైల్వేస్టేషన్‌కు వెళ్ళింది. బస్సు దిగిన కుటుంబ సభ్యులు హేమశ్రీ కనపడకపోవడంతో చుట్టుపక్కల వెతికి, ఈస్ట్ పోలీసులను ఆశ్రయించారు. రైల్వే స్టేషన్ వద్దనుంచి బస్సుడ్రైవర్ కుమార్ యాత్రికుని ఎక్కించుకొని తిరిగి అలిపిరి బాలాజీ బస్టాండ్‌కి వచ్చారు. అక్కడ సీనియర్ డిస్పాచ్ వి.మస్తాన్ బస్సు టికెట్లను తనిఖీ చేస్తూ హేమశ్రీ బస్సు మధ్య సీటులో నిద్రపోతూ ఉండడాన్ని గమనించారు. పాపను విచారించడంతో మాది వెంకటగిరి మండలం చిన్నపరెడ్డి పాల్యమని చెప్పింది. తండ్రి మస్తాన్ ఫోన్ నెంబర్ చెప్పడంతో ఆన్ డ్యూటీ కంట్రోలర్ వేలాయుధం ఆమె తండ్రి మస్తాన్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. తర్వాత ఈస్ట్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్‌కు అప్పజెప్పడం జరిగింది. పోలీసుల ద్వారా బాలికను కుటుంబం సభ్యులకు అప్పగించారు.

2వ రోజు మహానాడులో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబుని శాలువాతో సత్కరించిన తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మన్నూరు సుగుణమ్మ

ప్రశాంతంగా ముగిసిన సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు

ఉదయం 53.02 శాతం, మధ్యాహ్నం 52.57 శాతం హాజరు : కలెక్టర్

పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్:

యూపీఎస్సీ సివిల్స్ ప్రిలిమినరీ- 2023 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు రెండు సెక్షన్లలో పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ పరీక్షా కేంద్రాలను కలెక్టర్ పర్యవేక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతిలో నిర్వహించిన 13పరీక్షా కేంద్రాలలో సివిల్స్ ప్రిలిమ్స్ పరీక్షలు 6333 మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా ఉదయం 3358 మంది 53.02శాతం, మధ్యాహ్నం 3329 మంది 52.57 శాతంగా హాజరయ్యారని తెలిపారు. పరీక్ష పత్రాలను స్ట్రాంగ్ రూమ్ నుంచి బందోబస్తు నడుమ పరీక్షా కేంద్రాలకు తరలించడం జరిగిందన్నారు. తిరుపతి ఆర్‌డిఓ కనక నరసారెడ్డి పరీక్షాపత్రాల కస్టోడియన్ రెండు సెషన్లలో అన్ని పరీక్షా కేంద్రాలను సందర్శించడం జరిగిందన్నారు. అభ్యర్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించామని తెలిపారు. పరీక్షలు రాయడానికి బెంచ్‌లు, తాగునీరు, మెడికల్ క్యాంపులు, రవాణా సౌకర్యం వంటివి ఏర్పాటు చేశామని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఉదయం 8.30గంటలకు, మధ్యాహ్నం 1.30గంటలకు పరీక్ష సమయానికి గంట ముందే రెండు సెషన్లకు అభ్యర్థులకు ప్రవేశం కల్పించామని ప్రశాంత వాతావరణంలో నిర్వహించామని తెలిపారు. కేంద్ర యుపిఎస్సి నిబంధనల మేరకు అన్నివిధాలా పకడ్బందీ చర్యలు చేపట్టి పరీక్షలు నిర్వహించామని, అన్ని శాఖల సమన్వయంతో పరీక్షల నిర్వహణ విజయవంతమైందని తెలిపారు.

పాఠ్యాంశాలలో డార్విన్ సిద్ధాంతాన్ని కొనసాగించాలి

జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సమావేశాల సందర్భంగా కిరణ్ ఇంగ్లీషు మీడియం పాఠశాల నుంచి ఎస్వి ఆర్ట్స్ కాలేజీ ఐన్‌స్టీన్ విగ్రహం వరకు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా మాజీ ఎంఎల్‌సి గేయానంద్ మాట్లాడుతూ ఎన్‌సిఇఆర్‌టీ పదవ తరగతి పాఠ్యాంశాలు తొలగించడం సమంజసం కాదని దానిని కొనసాగించాలని కోరారు. డార్విన్ 1859లో 'జీవజాతుల పుట్టుక' (ఒరిజిన అఫ్ స్పెసస్) గ్రంథం వెలువరించిన నాడే సంచలనం సష్టించిందని అన్నారు. జీవ పరిణామాన్ని డార్విన్ లెక్కకు మిక్కిలి రుజువులతో సిద్ధాంతీకరించాడని తెలిపారు. ఈ పరిణామం ప్రకతి ఎంపికకు లోబడి ఉంటుందని సూత్రీకరించాడన్నారు. దాదాపు అందరి ఆమోదం ఉన్న ఈసిద్ధాంతాన్ని పాఠ్యాంశాల నుంచి తొలగించటం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. సత్యాన్ని మరుగుపరచి ఏ రకమైన పౌరులను తయారు చేస్తారని, ఈ విజ్ఞానం పిల్లలకు అవసరమని అన్నారు. రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 51ఏ (హెచ్)ను అనుసరించి శాస్త్రీయ దక్పథం పెంపొందించేందుకు విజ్ఞాన్ ప్రసార్‌ను ప్రారంభించడం జరిగిందని, విద్యార్థుల కోసం సైన్స్‌క్లబ్‌లు ప్రారంభించి పరిశోధనలు ప్రోత్సహిస్తున్న సంస్థను రద్దు చేసి ఒక సెల్‌ను ప్రారంభించడం మంచిది కాదని అన్నారు. విజ్ఞాన ప్రసార్‌ను రద్దు చేయకూడదని కోరారు. కార్యక్రమంలో జెవివి రాష్ట్ర ప్రధానకార్యదర్శి మురళీధర్, రాష్ట్ర కమిటీ సభ్యులు త్రిమూర్తులు, సత్యనారాయణ, రామారావు, సుబ్రమణ్యం, తిరుపతి అమీర్, జయరామిరెడ్డి, బిర్లా నాయుడు, నాగేంద్ర, డివైఎఫ్ఐ జయచంద్ర, ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ పి.సాయిలక్ష్మి, సాహితీ స్రవంతి కన్వీనర్ వెంకటరమణ, జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్

జిల్లాలో గాలివాన బీభత్సంతో మామిడి, టమోటా రైతులు భారీస్థాయిలో నష్టపోయారని, వారి పంటలను పరిశీలించి నష్టపరిహారాన్ని రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. చిత్తూరు జిల్లాలో విస్తారంగా మామిడి రైతులు ఉన్నారని అదే జీవనాధారంగా ఉంటున్నారు. దిగుబడి తక్కువ అయినప్పటికీ సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో ఉన్న పంటతోనైనా సరిపెట్టుకోవాలని ఆశతో రైతాంగం మొన్నటి వరకు ఉన్నది. అయితే రెండు రోజులుగా గాలివాన బీభత్సంతో ఉన్న మామిడి పంట కూడా పూర్తిగా రాలిపోయిన పరిస్థితి నెలకొంది. గతంలో అధికారులు మామిడి రైతులకు ధర నిర్ణయించడంలో రైతులను సంప్రదించకుండా కేవలం మామిడి పరిశ్రమలు యాజమాన్యాలతో సంప్రదించి అతితక్కువ రేటును నిర్ణయించారు. అయితే ప్రస్తుతం పంట రాలిపోవడంతో ఇంకా తక్కువగా రేటు నిర్ణయించే పరిస్థితి ఉంది. రైతాంగానికి గిట్టుబాటు లేక అప్పులపాలైన రైతులు దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారు. దీంతోపాటు టమోటా రైతులు కూడా ధరలు లేక అల్లాడుతున్న సందర్భంలో ఈ వర్షం వలన ఉన్న పంట కూడా పూర్తిగా దెబ్బతిన్న పరిస్థితి ఉందన్నారు. ఉద్యానశాఖ అధికారులు, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో చిత్తూరు జిల్లాలోని అన్ని మండలాల్లోనూ అన్ని రకాల పంటలను పరిశీలించి నష్టపోయిన రైతాంగానికి ప్రభుత్వం నుండి నష్టపరిహారం వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కలెక్టర్ వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో సమీక్ష చేసి నష్టపరిహారాన్ని శాస్త్రీయ పద్ధతిలో గుర్తించి రైతులను ఆదుకోవాలని పేర్కొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలు

ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న శ్రీధర్ వర్మ

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: నందమూరి తారక రామారావు శతజయంతి కార్యక్రమాన్ని ఆదివారం టౌన్‌క్లబ్ సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టిడిపి మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ మాట్లాడుతూ తెలుగు వారి ఆత్మకు గౌరవాన్ని సత్తా చాటిన ఎన్టీ రామారావు సేవలు తెలుగు ప్రజలు మరువలేనిది అన్నారు. తిరుపతి అభివద్ధికి ఎన్టీ రామారావు కషివల్లే జరిగిందన్నారు. తిరుపతిలో తెలుగుగంగ నీళ్లు, మహిళా యూనివర్సిటీ, తిరుమల కొండకు వెళ్లడానికి బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయడమే కాకుండా పేదలకు మెరుగైన వైద్యం అందించడానికి స్విమ్స్ హాస్పిటల్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. శత జయంతి ఉత్సవాలను ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్నాయని తెలిపారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

చిల్లీస్ అంజికి ఘన సన్మానం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాలను పరిష్కరించుకుని స్థానిక సప్తగిరినగర్‌లోని కమ్మవారి అభ్యుదయ సంక్షేమ సంఘం (కాస్)లో చిల్లీస్ రెస్టారెంట్ అండ్ హోటల్స్ అధినేత చిల్లీస్ అంజిని శాలువా, పుష్పగుచ్ఛాలతో ఆదివారం ఘనంగా సత్కరించి అభినందించారు. ఈసందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ ఎన్టీఆర్‌ను ఆదర్శంగా తీసుకొని పలు సేవా కార్యక్రమాలను చేయడంతో పాటు, బీసీ బడుగు బలహీన వర్గాల ఆర్థిక అభివద్ధికి అంజి చేస్తున్న సేవలను కొనియాడారు. ఎంతోమంది నిరుద్యోగ యువతకు తన వంతు ఉపాధి కల్పిస్తూ పదిమందికి ఆదర్శమవుతున్నారని, అంజిని ప్రతిఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అంజికి చిన్ననాటి నుంచే పదిమందిని ఆదుకోవాలని ఆకాంక్ష ఉండడం గర్వించదగ్గ విషయం అన్నారు. అంతకు ముందు చిల్లీస్ అంజి ఎన్టీఆర్ విగ్రహానికి మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో స్నేహితుడు రాజా, గుంటూరు గోరంట్ల పున్నయ్య చౌదరి, డాక్టర్ ఎర్రనాగేశ్వరరావు, డాక్టర్ రమేష్ నాథ్ లింగుంట్ల, కాస్ ఆర్గనైజేషన్ సెక్రటరీ జయరాం ప్రసాద్, అధ్యక్షులు పురంధర్ నాయుడు, కార్యదర్శి డి.గురప్ప నాయుడు, కెవి చౌదరి, మాజీ వైస్ ఛాన్సిలర్ పోలూరు మురళి, కాస్ వైస్ ప్రెసిడెంట్ రామచంద్ర నాయుడు, సుదర్శన్ బాబు, బి.ఎన్ నాగేశ్వరరావు, రామకష్ణ నాయుడు, కాస్ ఈసీ మెంబర్లు , సభ్యులు పాల్గొన్నారు.

చిల్లీస్ అంజిని సన్మానిస్తున్న నాయకులు, స్నేహితులు

సీఐటీయూ రాష్ట్ర కమిటీ సమావేశాలు జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-నాయుడుపేట: తిరుపతిలో జూన్ 10 నుంచి 13 వరకు జరిగే సీఐటీయూ రాష్ట్ర సమావేశాలను జయప్రదం చేయాలని నాయుడుపేట కార్యాలయంలో జరిగిన సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య పిలుపునిచ్చారు. నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి సిఐటియు అనుబంధ సంఘాల సమావేశాన్ని నిర్వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మాట్లాడుతూ కార్మికవర్గ ఐక్యత కోసం కషి చేయాలని..హక్కులు, కనీస వేతనాల అమలు కోసం, ఉద్యోగ భద్రత కోసం సమరశీల పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలు అన్నిటినీ రద్దు చేసి కార్పొరేటు సేవలో ఉందని.. కార్మికులు దీన్ని ప్రతిఘటించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ముకుందా, చాపల వెంకటేశ్వర్లు, శ్యామలమ్మ, కిష్టమ్మ, రమణయ్య, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

చెస్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతిలోని సీపీఐ భవన్ గంధమనేని శివయ్య కష్ణారెడ్డి భవన్లో ఏపీ స్టేట్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్ను తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వరరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ క్రీడాకారులందరినీ పలకరించి పిల్లలను రాష్ట్రస్థాయి పోటీలకు ప్రోత్సహిస్తున్న వారి తల్లిదండ్రులను అభినందించారు. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన వజ్రకేఎస్ ఆర్ ఈయూతో స్నేహపూర్వక మ్యాచ్ ఆడి ఇప్పటి వరకు జరిగిన 3 రౌండ్లలో 1.5 రేటింగ్ పాయింట్లు సాధించాడు. వజ్రక్ష్ తన కెరీర్లో తొలి ఫిడే ఓపెన్ టోర్నమెంట్ ఆడాడు. తిరుపతి జిల్లాకు అంతర్జాతీయ పతకాలు తెచ్చిన త్రిపురాంబిక సోదరీమణుల వంటి ప్రతిభావంతులైన యువకులను ఎస్పీ స్వయంగా అందరితో ముచ్చటించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా చెస్ అసోసియేషన్ ఛైర్మన్, ఆంధ్రా చెస్ అసోసియేషన్ వైస్ ఛైర్మన్ దివాకర్ రెడ్డి , తిరుపతి జిల్లా పోలీసు సిబ్బందికి చెస్ ఆటను పరిచయం చేయాలని, ఇది వారి దర్యాప్తు పద్ధతులకు తోడ్పడుతుందని పరమేశ్వరరెడ్డిని కోరారు.

జనసేనతో రైతు రాజ్యం

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: జనసేన అధికారంలోకి వస్తే రైతుదే రాజ్యం అని ఆ పార్టీ నాయకులు డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని తంబళ్లపల్లి నియోజకవర్గంలో ములకలచెరువు మండలం ముద్దినాయినపల్లి గ్రామంలో మండలాధ్యక్షులు సాయి ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన జనసేన పీఏసీ సభ్యులు, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు డాక్టరు పసుపులేటి హరిప్రసాద్ చేతుల మీదుగా జనసేన జెండా ఆవిష్కరణ, అలాగే బైక్ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించారు. రాబోవు రోజుల్లో జనసేన పార్టీని బలోపేతం చేయాలని.. మండలానికి 22 మంది చొప్పున జనసేన పార్టీ గురించి పార్టీ ఆశయాలు, సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా గౌరవ అధ్యక్షులు కష్ణయ్య, జిల్లా అధ్యక్షులు బత్తిన మధుబాబు, కార్యదర్శులు ఆనంద్, రెడ్డప్ప, బాబు, బాటసారి, మహిళా నాయకురాలు దారం అనిత తదితరులు పాల్గొన్నారు.

మాధవికి రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ఫెలో అవార్డు

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని రసాయన శాస్త్ర విభాగం ఆచార్యులు జి మాధవికి లండన్లోని రాయల్ సొసైటీ అందించే " రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ఫెలో అవార్డుకు" ఎంపికైనట్లు లండన్ లోని రాయల్ సొసైటీ వారు వెల్ల డించారు. కడప జిల్లాకు చెందిన జి. నాగిరెడ్డి సరోజమ్మ దంపతుల కుమార్తె జి.మాధవి సాధారణ రైతు కుటుంబంలో జన్మించిన ఆమె ఉన్నత విద్యను అభ్యసించి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో రసాయన శాస్త్ర విభాగంలో ఆచార్యులుగా పనిచేస్తున్నారు. ఆచార్య మాధవి పాఠశాల విద్యను సీఎస్ఐ హైస్కూల్ కడప, ఇంటర్, డిగ్రీ విద్యను గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ఫర్ మెన్, కడప, పీజీ రసాయన శాస్త్రం శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో చదివి గోల్డ్ మెడల్ సాధించారు. ఎస్వీ యూనివర్సిటీలో రసాయన శాస్త్రంలో పిహెచ్డిని పూర్తి చేశారు. 30 సంవత్సరాలకు పైగా పరిశోధన రంగంలో విశేష అనుభవం కలిగిన ఆమె బోధన రంగంలో 26 సంవత్సరాల అనుభవం కలదు. ఆచార్య జి. మాధవి అమెరికాలోని టెక్సాస్ నగరంలోని పలు లేబరేటరీలు, విశ్వవిద్యాలయాల్లో విసిటింగ్ ఆచార్యులుగా సందర్శించడం జరిగింది. ఆమె పర్యవేక్షణలో పది మంది విద్యార్థులకు పీహెచ్డీ అవార్డులు, ముగ్గురు ఎం.ఫిల్ విద్యార్థులకు అవార్డులు ఇవ్వడం జరిగింది. ప్రస్తుతం ఆరు మంది విద్యార్థులు పరిశోధకులుగా ఉన్నారు. ఆమె పర్యవేక్షణలో పీహెచ్డీలు పూర్తిచేసిన విద్యార్థులు దేశ, విదేశాలలో రసాయన శాస్త్ర లేబొరేటరీస్ లలో, పరిశోధన రంగంలో ఉన్నతంగా రాణిస్తున్నారు. రాయల సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ వారు రసాయన శాస్త్రంలో విశేషంగా కషి చేసి, రసాయన శాస్త్రం పరిశోధనలలో కృషి చేసిన శాస్త్రవేత్తలకు ఈ రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ ఫెలో అవార్డును అందించడం జరుగుతుందని వారు వెల్లడించారు. ఇప్పటికే పలు రాష్ట్రస్థాయి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక ఉన్నతమైన పరిశోధన సంస్థలు విశ్వవిద్యాలయాల నుంచి ఎన్నో అవార్డులను, రివార్డులను ఆమె అందుకున్నారు. పరిశోధనా రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని లక్ష్యంతో సొసైటీకి, సమాజానికి, సాధారణ గ్రామీణ ప్రజలకు తన పరిశోధనలు అందించాలని సంకల్పంతో ముందుకు వెళుతున్నట్లు ఆమె వెల్లడించారు. ఆచార్య జి. మాధవికి అవార్డు రావడంపై వర్సిటీ ఉన్నతాధికారులు ఉపకులపతి ఆచార్య రాజారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఓయండి హుస్సేన్, రసాయన శాస్త్ర విభాగాధిపతి ఆచార్య సురేష్ రెడ్డి, రసాయన శాస్త్ర విభాగం ఆచార్యులు వైవి రామిరెడ్డి, ఆచార్య వెంకట సుబ్బానాయుడు, మధుసూదన్ రెడ్డి, ఆచార్య పద్మావతి, ఆచార్య పద్మజ, ఎన్ వి వి జ్యోతి, ఎన్ వై శ్రీధర్, వెంకట్రావు అభినందనలు తెలిపారు.

రక్షక భటు నిలయం కలేనా..!

● మార్పుతో శాంతి భద్రతలకు విఘాతం ● కలగా మంగళంలో పోలీస్‌స్టేషన్ ● రక్షణ కరవంటున్న స్థానికులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం ప్రాంతం బతుకుదెరువు నిమిత్తం వచ్చిపోయే వారికి కేరాఫ్‌గా ఇప్పటికీ నానుడి. ఇక్కడ ఇంటి అద్దెలు ఇప్పటితో పోలిస్తే గతంలో తక్కుగానే ఉండటంతో వందల కుటుంబాలు వివిధ ప్రాంతాలు, రాష్ట్రాల నుండి ఇక్కడకు వచ్చి ఏదో బతుకుదెరువు చూసుకొని మనుగడ కొనసాగించేవారు. 2010 సంవత్సరంతో పోలిస్తే నేడు ఓ మండలానికి పైగా జనభా ఈ ప్రాంతంలో నివాసాలు ఏర్పరచుకొని జీవిస్తున్నారు. రోజురోజుకు జనాబా, మంగళం ప్రాంతం అభివృద్ధి చెందుతుండటంతో భూ విలువ భాగానే పెరిగింది. తిరుపతి నగరానికి కూతవేటు దూరం ఉండటంతో ఈ ప్రాంతంలో భూ క్రయవిక్రయాలు భాగానే జోరందుకున్నాయి. భూ తగాదాలతో ఇరు వర్గాలకు చెందిన వారు న్యాయం కోసం పోలీస్ స్టేషన్ను ఆశ్రయిస్తున్నారు. ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీగా ఉన్న ఈ మంగళం ప్రాంతాన్ని పరిపాలన సౌలభ్యం, వేగంగా అభివృద్ధి జరగడానికి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఐదు పంచాయతీలుగా విభజించారు. ఈ పంచాయతీలకు ఎన్నికలు జరిగి పాలక కార్యవర్గాలు కొలువుదీరి పాలన చేస్తున్నాయి. ఇంత వరకు భాగున్నా... మంగళం ప్రాంతం అటవీ సరిహద్దు ప్రాంతం కావడంతో చట్టవ్యతిరేక కార్యకలాపాలు గతంలో జరిగాయి. అక్రమ వ్యాపారాలు, వ్యాపారాల మధ్య ఆదిపత్యపోరులో హత్యలు జరిగిన ఉదంతాలు ఉన్నాయి. ఇవన్నీ అంతంత మాత్రం జనాభా కలిగిన సమయంలో జరిగాయి. నేడు వేల సంఖ్యలో నివాసాలు, దాదాపు 39 హ్యాబిటేషన్లుగా ఉన్న మంగళం పరిధిలోని నాలుగు పంచాయతీలు సప్తగిరి కాలనీ, రణధీరపురం, మంగళం క్వార్టర్స్, తిరుమలనగర్ పంచాయతీలు, తిరుపతి నగరంలో కలపగా మిగిలిన మిట్టగాంధీ పురం, మంగళం గ్రామం, చెన్నాయిగుంట నివాస ప్రాంతాల ప్రజలు దగ్గరగా ఉన్న అలిపిరి పోలీస్‌స్టేషన్ పరిధి నుండి దాదాపుగా 8 కిలోమీటర్లు దూరమున్న తిరుచానూరు పోలీస్‌స్టేషన్‌కు మార్పు చేయడాన్ని నిరసిస్తున్నారు.

మంగళం పోలీస్ స్టేషన్ నిర్మాణం కలేనా?

గతంలో మంగళం పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి అప్పటి ఎస్‌పి జయలక్ష్మి సుముఖత చూపారు. శెట్టిపల్లి పంచాయతీ కార్యవర్గం ఇందుకు సమ్మతించి తీర్మాణం చేసి డిపార్ట్‌మెంట్‌కు అందించింది. అయితే ప్రజలంతా ఆశగా పోలీస్ స్టేషన్ ఏర్పాటును స్వాగతించారు. ఎక్కడ జాప్యం జరిగిందో తెలియదు గాని మంగళం పోలీస్ అవుట్ పోస్ట్ అలానే ఉండి పోయింది.

శాంతిభద్రతల అదుపునకు సహకరించాం

మంగళం ప్రాంతం ప్రజలకు శాంతిభద్రతలు ఉండాలని, మన ప్రాంతంలో పోలీస్ అవుట్‌పోస్ట్ ఏర్పాటు జరిగితే ఆకతాయిలు, నేరాలకు పాల్పడేవారిలో మార్పు వస్తుందని పంచాయతి కార్యవర్గంతో చర్చించి దాదాపుగా 150 అంకణాలకు పైబడి తిరుపతి-కరకంబాడి ప్రధాన మార్గానికి ఆనుకుని ఉన్న స్థలాన్ని ఇచ్చాం. కాల క్రమేణ జనాభా పెరగడంతో పోలీస్‌స్టేషన్ అనివార్యంగా మారింది. ఇప్పుడు మంగళం ప్రాంతంలోని పంచాయతీలను అలిపిరి నుండి తిరుచానూరు మార్చడం సహేతుకం కాదు. ఇక్కడ నివసించే పేదలు ఏదేనీ సమస్య వస్తే 8 కిలోమీటర్లు వెళ్లి ఫిర్యాదు చేయాలంటే కష్టసాధ్యమౌతుంది. అభివృద్ధి చెందుతున్న మంగళం ప్రాంతానికి పోలీస్‌స్టేషన్ ఉండాలని, ఈ సమస్యను ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు కృషి చేస్తాను.

- చిలమంద మునికృష్ణ, మాజీ సర్పంచ్ ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీ

అవుట్‌పోస్ట్‌ను పోలీస్‌స్టేషన్ చేయాలి

స్థానికంగా పాఠశాలలు, కళాశాలలు, హాస్టల్స్ ఏర్పడ్డాయి. జిల్లా పరిషత్ పాఠశాల ప్రాంగణంలోనే ప్రభుత్వం జూనియర్ కళాశాల కూడా ఏర్పాటు చేశారు. ఈవిదంగా మౌళిక వసతులు అభివృద్ధి చెందుతున్న మంగళం ప్రాంతానికి పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా ఈ ప్రాంతంలో మహిళలు సమస్యలు ఎదుర్కోంటున్నారు. వారి సమస్యలపై తిరుచానూరు పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళి ఎలా ఫిర్యాదులు చేస్తారు. పైగా సరైనా రోడ్డు మార్గం సైతం లేదు. స్వార్ధ ప్రయోజనాలను పక్కనపెట్టి స్థానిక ప్రజల ప్రయోజనాల కోసం మంగళంలో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయ్యాలి.

-రామంజేరి మహేశ్వరి, టిడిపి తిరుపతి రూరల్ మండలాధ్యక్షురాలు

ప్రజల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకోవాలి



మంగళంలో స్థానికంగా నివాసమున్న ప్రజల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు నిర్ణయాలు తీసుకోవాలి. మంగళం పోలీస్ అవుట్ పోస్ట్‌ను పోలీస్ స్టేషన్‌గా మార్పు చేస్తూ స్టేషన్ నిర్మాణం చేపట్టాలి. ఎమ్మెల్యేలు, అధికారుల ప్రజాభీష్టం మేరకు మార్పులు చేయాలి. ఎంతో దూరంలో ఉన్న తిరుచానూరు పోలీస్ స్టేషన్‌కు మంగళం పంచాయతీల పరిధిని అనుసంధానించడం సరికాదు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు ప్రజలకు సౌలభ్యం కలిగేలా పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలి.

- నిమ్మనపల్లి మునిరత్నం, సీనియర్ నాయకులు, సిపిఎం పార్టీ

అభివృద్ధి.. సంక్షేమంలో ఆదర్శం..చంద్రగిరి

ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

ప్రజాశక్తి-క్యాంపస్: అభివద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలులో చంద్రగిరి నియోజకవర్గాన్ని దేశానికి ఆదర్శంగా తీసుకురావడం జరిగిందని, అందులో ప్రధాన పాత్ర వాలంటీర్లదేనని స్థానిక ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలోనే అతి పెద్ద నియోజకవర్గమైన చంద్రగిరి నియోజకవర్గంలో వాలంటీర్ల సంఖ్య అన్నింటికంటే ఎక్కువగా ఉందన్నారు. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియమితులైన వాలంటీర్లు ప్రజాసేవలో విశేష ప్రతిభను చూపారని, అప్పగించిన పనిని చిత్తశుద్ధితో చేస్తూ వాలంటీరు అంటే ఉద్యోగం కాదు సేవ చేయడమేనని నిరూపించారంటూ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ప్రజా సేవలో అత్యంత ప్రతిభ చూపిన వాలంటీర్లకు రాష్ట్ర ప్రభుత్వం సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అవార్డులను ప్రదానం చేసిందన్నారు. పేద ప్రజలకు సేవ చేయడంలో ప్రతిభ చూపిన వాలంటీర్లకు రెండు చేతులు జోడించి వందనం సమర్పించారు.

1900 మంది వాలంటీర్లకు సత్కారం

చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాలకు చెందిన 1900 మంది వాలంటీర్లకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి స్వయంగా సన్మానం చేశారు. తిరుపతి ఎస్వీయూ శ్రీనివాసా ఆడిటోరియం వేదికగా ఆదివారం వాలంటీర్లకు వందనం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముందుగా దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డికి పూలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే కాకుండా కరోనా వంటి కష్టం వచ్చినా, వరదలు వంటి విపత్తు వచ్చినా, పండుగలు వచ్చినా, ఆరోగ్య సమస్యలు వచ్చినా తమకు కేటాయించిన 50 ఇళ్లలో ఎవరికి ఏ కష్టం వచ్చినా సరే అందరికంటే ముందుగా నేనున్నాను అంటూ అండగా నిలబడే గొప్ప మనస్సు కలిగిన వ్యక్తి ఎవ్వరైనా ఉన్నారంటే జగనన్న ప్రభుత్వం నియమించిన వాలంటీరు మాత్రమేనన్నారు. కరోనా సమయంలో అందరూ ప్రాణభయంతో ఇళ్లలో దాక్కుంటే చంద్రగిరి నియోజకవర్గ ప్రజలను కాపాడుకునే ప్రయత్నంలో కాయగూరలు పంపిణీ, కోడిగుడ్లు, విటమిన్ ట్యాబ్లెట్లు, పండ్లు, నిత్యావసర సరుకులు వంటి వస్తువులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. తాను ఏ పని చేసినా పూర్తి స్థాయిలో విజయవంతం చేసింది వాలంటీర్లు మాత్రమేనన్నారు. తన ఆదాయంలో 75 శాతం ప్రజలకు ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ పదో తరగతిలో స్కూల్ ఫస్ట్ వచ్చిన వారికి ట్యాబ్‌లు, మండలం స్థాయిలో టాపర్ గా నిలిచిన వారికి ల్యాప్ టాప్‌లను పంపిణీ చేస్తామని తెలిపారు. అనంతరం వాలంటీర్లకు మెడల్స్, ధ్రువీకరణ పత్రాలతో పాటు స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వాలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు.

వేద విశ్వవిద్యాలయంలో వేసవి యోగా శిక్షణ శిబిరం

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర వేద విశ్వ విద్యాలయంలో వేసవి యోగాభ్యాస శిక్షణ శిబిరం సోమవారం నుండి ప్రారంభమై జూన్ 17 వరకు 20 రోజులపాటు జరగనుంది. 12 సంవత్సరాల వయసు పైబడి, ఆసక్తి ఉన్నవారు ఎవరైనా ఈ వేసవి యోగా శిక్షణ శిబిరంలో పాల్గొనవచ్చు. ఇందుకుగాను రూ. 200 ఫీజు చెల్లించి శిక్షణ పొందవచ్చు. రోజూ ఉదయం 7 గంటల నుండి 8 గంటల వరకు వేద విశ్వవిద్యాలయ ప్రాంగణం అన్నపూర్ణ సదనంలో శిక్షణ శిబిరం ఉంటుంది. ఆసక్తి కలవారు 9247210327, 9110503203 ఫోన్‌నంబర్లను సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

నేడు ద్విచక్ర వాహనాల వేలం

ప్రజాశక్తి -సత్యవేడు: సత్యవేడు పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో 29న సోమవారం ద్విచక్ర వాహనాల బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్సై పురుషోత్తంరెడ్డి తెలిపారు. మద్యం అక్రమ తరలింపు కేసులో పట్టుబడిన 27 ద్విచక్ర వాహనాలను తిరుపతి అసిస్టెంట్ ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో సోమవారం వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఉదయం 10.30 గంటలకు వేలం ఉంటుందన్నారు. వేలంలో పాల్గొనేవారు ఉదయం తొమ్మిదికి హాజరై రూ.2 వేలు డిపాజిట్ చెల్లించి టోకన్లు తీసుకోవాలని కోరారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి-గూడూరు రూరల్: తెలుగువారి ఆత్మగౌరవాన్ని ఢిల్లీ స్థాయిలో తెలియజేసిన మహోన్నత వ్యక్తి నందమూరి తారక రామారావు అని.. ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని గూడూరు టిడిపి మాజీ కౌన్సిలర్ ఇజ్రాయిల్ వెల్లడించారు. ఆదివారం గూడూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా నాయకులు కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నరసింహులునాయుడు, రవీందర్‌రెడ్డి, శివప్రసాద్, వెంకటేష్, సునీల్, అల్లి బాషా తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్ : స్వర్గీయ నందమూరి తారక రామారావు శత జయంతిని పరమేశ్వరమంగళం, వేపగుంట గ్రామాల్లో, పుత్తూరు పట్టణంలోని అంబేద్కర్ కూడలి వద్ద ఘనంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పరమేశ్వరమంగళంలో మధ్యాహ్నం మాజీ ఎంపీపీ గంజి మాధవయ్య చేతుల మీదుగా అన్నదానం చేశారు. కార్యక్రమంలో రూరల్ పార్టీ అధ్యక్షులు రవికుమార్, ప్రధాన కార్యదర్శులు, బాలాజీ, సుధాకర్ నాయుడు, వార్డు మెంబర్ లక్ష్మీపతి నాయుడు, బాబునాయుడు, ఇందుమతి, ఆర్.మనోహర్, కొరపాటి మధురం, గణేష్, సుధాకర్, గణేష్, సుబ్రమణ్యంనాయుడు, తేజ, రవి, రాజా, తులసి, శంకర్‌నాయుడు, మహేష్, అడుసుమల్లి హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): కడప జిల్లా మైదుకూరు, అన్నమయ్య జిల్లా తుమ్మలబైలు ప్రాంతాల్లో 23 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, 16 మందిని అరెస్టు చేశామని టాస్క్ ఫోర్స్ డిఎస్పిలు చెంచుబాబు, మురళీధర్ తెలిపారు. ఆదివారం తిరుపతి నగర పరిధిలోని కపిలతీర్థం వద్ద ఉన్న టాస్క్ ఫోర్స్ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పిలు మాట్లాడుతూ ఎర్రచందనం అక్రమ రవాణాపై టాస్క్ ఫోర్స్ ప్రత్యేక నిఘా ఉంచి ఎప్పటికప్పుడు స్మగ్లర్ల ఆటను కట్టడి చేస్తూ ముందుకు వెళుతుందన్నారు. శనివారం రాత్రి నుండి కూంబింగ్ చేపట్టామన్నారు. ఆర్ఐ చిరంజీవికి చెందిన ఆర్ఎస్ఐ నరేష్ బందం కడప సబ్ కంట్రోల్ నుంచి సీఎల్ బావి బేస్ క్యాంపు చేరుకుని అగ్నిగుండాల మీదుగా తిప్పిరెడ్డిపల్లి, అక్కడ నుంచి జోరగోడ్లు ప్రాంతానికి ఉదయం చేరుకోగా కొందరు ఎర్రచందనం దుంగలను మోసుకుని వస్తూ కనిపించారన్నారు. వారిని చుట్టుముట్టి అనంతపురం, కడప జిల్లాలకు చెందిన 14 మందిని అరెస్టు చేశామన్నారు. వారి నుంచి 17 ఎర్రచందనం దుంగలు, ఒక లగేజీ ఆటో, రెండు మోటారు సైకిళ్లు, 13 పిడిలేని ఇనుపగొడ్డళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే ఆర్ఐ సురేష్ కుమార్ రెడ్డి బందానికి చెందిన ఆర్ఎస్ఐ లింగాధర్ సానిపాయ బేస్ క్యాంపు నుంచి పొంతరేవల మీదుగా కూంబింగ్ చేస్తుండగా, అన్నమయ్య జిల్లా రాజంపేట రేంజిలోని తుమ్మలబైలు చేరుకుని చిప్పగొందిదొన వద్దకు రాగా, అక్కడ కొందరు ఎర్రచందనం దుంగలు మోసుకుని వస్తూ కనిపంచారు. వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా కొందరు పారిపోగా, తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఇద్దరిని పట్టుకోగలిగారన్నారు. వీరి నుంచి 6 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 23ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకోగా, వీటి విలువ 40 లక్షల రూపాయలు ఉంటుందని తెలిపారు. త్వరలోనే దీని వెనుక ఉన్న వారిని అరెస్ట్ చేస్తామన్నారు. కేసులను సీఐ బాలకృష్ణ, ఎస్ఐ మోహన్ నాయక్ దర్యాప్తు చేస్తున్నారన్నారు.

అనుమానాస్పదంతో భర్త మృతి

అలిపిరి పోలీస్ స్టేషన్లో భార్య ఫిర్యాదు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: భర్త మృతి చెందడంతో దహనక్రియల సమయంలో శరీరంపై గాయాలు చూసి అనుమానంతో దహన క్రియలను నిలిపివేసి శవాన్ని తీసుకొని తిరుపతి అలిపిరి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పూతలపట్టు మండలం గొడుగు చింతకు చెందిన నీరుగట్టు శంకర్(43) 15 సంవత్సరాల క్రితం తిరుపతికి వెళ్లి లీలామహల్ సర్కిల్ వద్ద అన్నపూర్ణ ట్రావెల్స్ లో మేనేజర్ గా పని చేస్తున్నాడు. కాపురం వరదానగర్లో ఉంటున్నాడు. రోజూ ఉదయం డ్యూటీ కి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చేవాడు. శుక్రవారం ఉదయం డ్యూటీ కి వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చి మళ్లీ డ్యూటీకి వెళ్లాడు. ట్రావెల్స్ దగ్గర ఏం జరిగిందో తెలియదు ఐదు గంటల ప్రాంతంలో శంకర్ భార్య శిరీష కు ట్రావెల్స్ నుండి ఫోన్ చేసి మీ భర్త శంకర్‌కు గుండెపోటు వచ్చింది. స్విమ్స్‌లో ఉన్నామని చెప్పారు. భార్య స్విమ్స్‌కు వెళ్లగానే ట్రావెల్స్ సిబ్బంది చనిపోయాడని చెప్పడంతో ఆమె వారిపై నమ్మకంతో ఏమి చేయలేక భర్త శవాన్ని తీసుకొని శుక్రవారం రాత్రి స్వగ్రామం గొడుగుచింతకు వచ్చారు. శనివారం సాయంత్రం బంధువుల సమక్షంలో దహన క్రియలకు ఏర్పాటు చేశారు. భర్త మతదేహాన్ని దహనం చేసే సమయంలో బట్టలు విప్పడంతో ఎద రొమ్మున, శరీరంపై గాయాలు, రక్తం గడ్డ కట్టడం చూసిన భార్య, బంధువులు అనుమానం రావడంతో భర్త మృతదేహాన్ని శనివారం రాత్రి తిరుపతికి తీసుకుని వెళ్లి పోలీస్ స్టేషన్లో భార్య శిరీష ఫిర్యాదు చేసింది. పోలీసులు 174 సీఆర్పీ కేసు నమోదు చేశారు. ఆదివారం శంకర్ మతదేహానికి తిరుపతి రుయా ఆస్పత్రిలో పోస్ట్ మార్టం చేసి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఆదివారం సాయంత్రం స్వగ్రామం గొడుగు చింతల దహన క్రియలు నిర్వహించారు. ట్రావెల్స్ లో పనిచేస్తున్న సిబ్బందిని పోలీసులు విచారిస్తే అసలు విషయాలు బయటకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. మతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవాలి

ప్రజాశక్తి-ఓజిలి: ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేయాలని చూస్తోందని కూలీలు ఐక్యంగా కాపాడుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకురాలు పద్మమ్మ, జెవీకేయస్ జిల్లా అధ్యక్షులు బి. గోపాల్ పిలుపునిచ్చారు. ఓజిలి మండలం కుందాం రాజుపాలెం పరిధిలో ఉపాధి హామీ కార్మికులతో సమావేశమై ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ రెండు పూటలా పెట్టే విధానాన్ని రద్దు చేయాలని, కూలీలకు వేసవికాలంలో సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.